

# వలపు చినుకు - బ్రతుకు చిరుగు

శేఖర్ జాలిగా చూశాడు రాజావైపు.

దీర్ఘంగా నిట్టూరుస్తూ, శూన్యంలోకి చూస్తూ, దాదాపు మతి చలించినవాడిలా ఉన్నాడు రాజా.

"రాజా! జీవితమంటే ఈ వేదనే అనుకున్నావా? వేదనని దిగమింగుకుని, జీవితాన్ని హాయిగా గడుపుతున్న వాళ్ళెంతమంది లేరు? కాస్త వేదనని నిగ్రహించుకోగలిగినప్పుడే జీవితానికి ధైర్యంగా ఎదురీదగలవు. అన్నీ తెలిసినవాడివి. నీకు నేనేం చెప్పగలను? జీవితంలో జరిగే ఎన్నో సంఘటనలలో ఇది ఒకటి. దీనిగురించి నీవు అంతగా బాధపడకూడదు." శేఖర్‌కి ఒక ఆత్మీయుడుగా ఇంతకంటె ఏం చెప్పాలో అర్థంకాలేదు.

శేఖర్‌వైపు చిత్రంగా చూశాడు రాజా.

"లేదు, శేఖర్. నా బాధ నీకు అర్థంకాదు. నేనీనాడు ఈ స్థితిలో ఉండటానికి పద్మ అలా మాట్లాడింది? బహుశః నాలాంటి సామాన్యులెవ్వర్నీ ఏ ఆడదీ ప్రేమించదేమో? — తిలక్ ఓ మాట అన్నాడు. గుర్తుందా, శేఖర్?

'జీవితం నవనీతంమీద,
చెదరనీకు రాయినీ, రప్పనీ,
పగులుతుంది స్వప్నం;
రగులుతుంది దుఃఖం;
బ్రతుకే ఉలిపిరికాగితం పందెం ...' అని.

"నాది నిజంగా ఉలిపిరి కాగితంలాంటి జీవితం శేఖర్."

రాజాలో ఆవేశం పలికింది. కళ్ళలో నీరు చిమ్మింది.

తన సాహిత్య పరిజ్ఞానాన్ని జీవితానికి అన్వయించుకోవడం రాజాకు సరిపాటే. శేఖర్‌తో అప్పుడప్పుడు వాదిస్తూంటాడు, అలా అన్వయించుకుంటేనే సాహిత్యానికి చరితార్థత కలుగుతుందని. అతనిలో మరో విశేషమేమిటంటే, అతని మానసికావస్థనిబట్టి, అనుభవాన్నిబట్టి సందర్భానుసారంగా తాను చదివిన సాహిత్యం చటుక్కున గుర్తుకురావడం. స్నేహితుల బృందంలో అతనికి ఇది ఒక పేరుకూడా ఉంది.

శేఖర్ నవ్వుతున్నాడు.

"నీ జీవితంకాదు, రాజా, నీ మనస్సు ఉలిపిరికాగితం! దానిమీద అందమైన ఊహల్ని చిత్రించుకుని భద్రంగా ఉంచుకో. అంతేగాని చింపెయ్యకు!" —

"ఏనాడో చిరిగింది, శేఖర్."

"నీ భ్రమ...అంతే."

ఇద్దరిమధ్య కొన్ని నిమిషాలు నిశ్శబ్దం.

రాజా ఒక్క ఉదుటున లేచి నిలబడ్డాడు.

"శేఖర్! మా నాన్నగార్ని, నన్ను తూలనాడిన మా మామయ్యకీ, పద్మకీ గట్టిగా బుద్ధిచెప్పాలి!" అంటూనే, వివరాలు చెప్పకుండా గబగబ కాగితమూ, కలమూ తీసుకుని, టేబిల్‌ముందు కూర్చొని, పెన్ను నోటికి ఆనిస్తూ, ఆలోచనలో నిమగ్నుడయ్యాడు.

అతనేం చెయ్యబోతాడో శేఖర్‌కి బాగా తెలుసు. మనస్సులో పొంగే తరంగాలకి చక్కని ప్రతిధ్వని అయిపోతాడు రాజా. ఇప్పుడు తన సాహిత్యపరమైన విజ్ఞానాన్ని అంతటినీ ఉపయోగించి ఎవరికో ఉత్తరం రాస్తాడు. దాన్ని అందుకున్నవాళ్ళ మనస్తత్వాల్నిబట్టి, దాని పర్యవసానంగా అతన్ని అభిమానించడమో, ద్వేషించడమో జరుగుతూ ఉంటుంది. అతనిదొక వింత వాదం. అభిమానించినా, ద్వేషించినా ఏది పట్టించుకోడు. రాసినందుకుమాత్రం అతనికి గొప్ప సంతృప్తి.

* * *

"చిట్టిరాజా మామయ్యగారికి రాజా నమస్కారములు.

నా పూర్తి పేరు రాజగోపాల్. మరింత స్పష్టంగా అర్థం కావాలంటే, మరిక మీకు అక్కయ్య అయిన సరోజమ్మగారి కుమారుణ్ణి. తెలిసిన తరువాత, మనస్సులో ఏర్పడ్డ రంగులన్నీ సమ్మిశ్రమమై, ఒక్కసారి ప్రజ్వలించి, మీలో ఒక జేగురురంగు ఏర్పడుతుందని నాకు తెలుసు.

క్షంతవ్యుణ్ణి.

## కన్య

మీరు విజయనగరంలో ఉన్నప్పుడు, పద్మ సికింద్రాబాద్‌లో నైన్త్ ఇయర్ చదువుతున్నప్పుడు, నేను ఇదివరలో సికింద్రాబాద్ వెళ్ళినప్పుడు నా మనస్సుకి ఒక బురద అంటుకుంది. దాన్ని కడుక్కునే ప్రయత్నమే ఈ రెండు మాటలు ... కొంచెం జాగ్రత్తగా చదవమని నా ప్రార్థన.

దీనితో జతపరిచిన ఉత్తరాలు పద్మ జీవితంలో తను మొదటి పొరపాటు. పరవాలేదు. తెలియని వయస్సు. క్షమించండి ఆమెని.

మేము పద్మని పెళ్ళిచేసుకుంటామని ముందుగా రావడం కేవలం ఈ కాలంలో [illegible] దాక్షిణ్యంకొద్దీ కాదు. అయినా అటువంటి దారుణమైన అభిప్రాయం మీలో కలిగిందంటే చాలా విచారించాలి.

అసలు ఒకరకంగా మీరంటే నాకు గొప్ప గౌరవం ఉండేది. పద్మకి తల్లి, తండ్రి, సర్వమూ మీరే అయి, చితికిపోతున్న జీవితంలోకూడా మీ కర్తవ్యాన్ని గ్రహించి, ఎంతో దూరంగా ఉంచి ఆమెకు చదువు చెప్పిస్తున్నా రంటే మీమీద నాకు విశేషమైన గౌరవాభిమానాలు ఏర్పడ్డాయి. ఒక ఆడపిల్లకోసం, నిస్వార్థంగా, ఎంతో ఓరిమితో, పట్టుదలతో కృషిచేసే వారంటే నాకు చాలా ఇష్టం. అటువంటి కార్యశూరుల చేతుల్లో, అల్లారుముద్దుగా తయారైన బంగారు బొమ్మ పద్మ. ఇదే పద్మమీద నా అభిప్రాయం. నేను నా జీవితాన్ని కొన్ని కొన్ని సిద్ధాంతాల పరిధిలో మలుచుకోడానికి యత్నిస్తున్నాను కాబట్టి పద్మ సౌందర్యం నాకు అనవసరమనీ, అనైతికమనీ అని భావించాను అనాడు."

"పద్మా! మా నాన్నగారు చాలా మంచివారు. నేనంటే ఎంతో అభిమానమూ, నా మాటమీద గౌరవమూను. మా కోరికలు ఏవీ కాదనరు. అందుకే నేను మా నాన్నగారిదగ్గర ఏదీ దాచకుండా, నిర్భయంగా చెబుతూంటాను. ఒకవిధంగా మా నాన్నగారు మా కిచ్చిన స్వాతంత్ర్యంవల్లే నేను జీవితమంటే ఏమిటో తెలుసుకోగలిగాను."

"మా నాన్నగారు అలాంటివారు కాదు, రాజా.

నీకు మీ నాన్నగారి దగ్గిరున్నంత చనువు, నాకు మా నాన్నగారి దగ్గిర లేదు. ఆయనకు ఎదురుపడి ఏదీ అడిగే ధైర్యం నాకు లేదు. ఇంతవరకు కలగలేదు. కాని. ఆయనంటే మాకు గొప్ప గౌరవం, వినయం, భక్తి, భయమూను. పైగా, ఆడపిల్లని. నా అంతట నేను ఎలా అడగగలను, చెప్పు? ఎలాగో ప్రయత్నించి, మా నాన్నగారిని ఒప్పించే భారం నీదే!"

"అవును. నువ్వన్నదీ నిజమే. నీ అంతట నువ్వు అడిగితే, మీ నాన్నగారు నిన్ను అపార్థం చేసుకోగల అవకాశంకూడా ఉంది. మన ప్రథమ కర్తవ్యం, మన పెద్దవాళ్లని ఒప్పించడం. ఇందుకు నాకు సహాయంచెయ్యగల మా మామయ్యలందరిని అర్థిస్తాను. మీ నాన్నగారిని ఒప్పించేలా ప్రయత్నిస్తాను. మీ బావగారి మంచితనంమీద నమ్మకం ఉంది నాకు. ఆత్మవిశ్వాసంతో మొదలుపెట్టిన ఏ పనీ అపజయం పొందదు. తప్పకుండా నువ్వు . . ."

"నేను . . . నా దాన్ని."

ఈ పైది మా ఇద్దరిమధ్య జరిగిన సంభాషణ. ప్రశాంతమైన చల్లని వాతావరణంలో సాగిన నిర్మలమైన సంభాషణ.

'మానవుడుగా పుట్టిన తరవాత అన్నివైపుల నుండి, మంచి ఆలోచనలు రావాలి. ఆ ఆలోచనల మేరకు కృషి చెయ్యాలి.' ఈ ఆర్య సిద్ధాంతంమేరకు మా మామయ్యల్ని నా ఆశయ సిద్ధికోసం అర్థించాను. వారి హామీ నాకు చాలా ధైర్యాన్నీ, ఆనందాన్నీ ఇచ్చింది. అప్పట్లో అదృష్టంతాలూకు చిహ్నాలు నాలో ఉన్నాయని సంబరపడ్డాను.

మామయ్యలు మీ నిర్ణయం చెప్పారు. జీవితం తారుమారయింది. మా నాన్నగారు, అమ్మ, అక్క, అన్నయ్యలు నన్ను చిత్రంగా చూశారు. ఎంతో అభిమానం ఉన్నవాళ్లు అందరూ 'ఎంతో తెలివైనవాడనుకుంటే ఇదేమిటి ఇలా అయ్యాడు?' అనుకున్నారు, అన్నారు. అని నవ్వుకున్నారు. జీవితం ఊహించినంత అందంగా ఉండదని నేను చాలా కథల్లో చదివినా, నిజంగా అనుభవించాను ఇప్పుడు.

ఎంతో నిర్మలంగా, మంచిగా ఉన్న మా ఆలోచనలకు ఇటువంటి ఫలితాలు ఏర్పడటం కేవలం విధివల్లనే కాదు, కలియుగ మహాత్మ్యంవల్లకూడా.

ధర్మం వశింపజెయ్యబడుతుందని, మోసం జయింపజెయ్యబడుతుందని కలియుగ ధర్మంలోనే ఉంది. బహుశఃమంచి ఆలోచనలతో బ్రతకడంకూడా ఈ కలియుగంలో ఒక నేరమేనేమో!

ఏది ఏమైనా, నాకు ధర్మపథంమీద అమితమైన గౌరవం, నమ్మకం ఉన్నాయి. 'ధర్మ విస్తారకమయ్యు, సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్' అన్నది ఎప్పటికీ నిలచే నిజం అని నా అభిప్రాయం.

కౌరవులదగ్గిర శ్రీకృష్ణుడి రాయబారం విఫలమైనట్టు, మీదగ్గిర మామయ్యల రాయబారం విఫలమైంది. ధర్మము, ప్రేమ, దయ, గుణము, నీతి — వీటికి స్థానం లేనప్పుడు అధర్మాన్ని అధర్మంతోనే జయించారు పాండవులు. అందుకే శిఖండిని ఎదురుగా నిలబెట్టి అధర్మంగా భీష్ముణ్ణి పడగొట్టారు. రథచక్రాలు కుంగిపోగా, నిస్సహాయుడై ఉన్న కర్ణుణ్ణి అదును కనిపెట్టి హతమార్చారు.

ఎన్నడూ అసత్యం పలకని ధర్మరాజు, ఒక చిన్న అబద్ధంతో ద్రోణుణ్ణి కూలద్రోశాడు.

**ఉలిపిరికాగితంవంటి మనస్సులో అందమైన ఊహలకు రూపాలు దిద్ది భద్రంచేసుకున్నా, యథార్థజీవితం ఊహించినంత అందంగా ఎప్పుడూ ఉండదు. గాలిమేడలు, పేకమేడలు కూలిపోతాయని అందరూ ఎరిగున్న సత్యమే అయినా, అది నిజం అని తెలుసుకోడానికి ప్రతివ్యక్తి స్వసుఖాన్ని బలిపెడుతుంటాడు.**

యుద్ధ ధర్మాల్లో స్పృశించదగని తొడలపై గదతో కొట్టి దుర్యోధనుణ్ణి కడతేర్చారు.

'యదాయదాహి ధర్మస్య
తదాత్మానం సృజామ్యహం —'

అధర్మంగానైనాసరే, అధర్మాన్ని అంతమొందించి, ధర్మాన్ని పునః ప్రతిష్ఠిద్దామని శ్రీ కృష్ణపరమాత్మ సంకల్పమై ఉండవచ్చు.

ఈ ధర్మాన్ని అనుసరించి నేను అధర్మంగానే, పద్మని లేవనెత్తుకుపోయి, ఏ తిరుపతికో తీసుకువెళ్లి పెళ్లిచేసుకోగల తెగింపూ, చొరవా నాలో లేకపోలేదు. మీలాంటి పిడుగురాళ్లని లెక్కచెయ్యకుండా, నా మార్గాన్ని నేను అనుసరించగల ఆత్మబలం నాలో లేకపోలేదు. అయితే, ఇంతటి సాహసానికి ఒడిగట్టడానికి తగ్గ ఆత్మస్థైర్యం పద్మలో లేదు.

పద్మ మనసు పిరికిది. ఏ ఎండ కా గొడుగు పట్టి, ఏ జాతర కా డోలు కొట్టి, అవకాశాన్నిబట్టి మారిపోయే భీరువు! అటువంటి భీరువుకోసం నేనింతగా తాపత్రయపడి, అందరిలో పేలవమైపోయి నా వ్యక్తిత్వాన్నీ, నా సౌశీల్యాన్నీ త్యాగం చెయ్యవలసిన అవసరం లేదనిపిస్తూంది.

తనకు పెద్దపెద్ద సంబంధాలు వస్తున్నాయనీ, మీరు నన్ను ఒప్పుకోవడంలేదనీ కుంటిసాకులు చెప్పి, తప్పించుకుంటున్న పద్మ ఆంతర్యం అర్థమయింది.

'క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ . . .' అని ఎంత పెద్దన్నగారన్నా తనని నమ్ముకుని, కార్యసిద్ధికోసం కృషిచేసే పురుషుణ్ణి మోసగించే స్త్రీకి భారతీయ సంప్రదాయంలో పవిత్రత ఆపాదించలేం.

మీరు చేసుకొమ్మన్నా, ఇప్పుడు నేను పద్మను చేసుకోదలుచుకోలేదు.

ఎందుకంటారా?

'అనాతురోత్కంఠితయోః ప్రసిధ్యతా
సమాగమే నాపి రతిర్నమాం ప్రతి
పరస్పరప్రాప్తి నిరాశయోర్వరం
శరీర నాశోపి సమానురాగయోః —'

అన్నారు శ్రీ కాళిదాసు మాళవికాగ్నిమిత్రంలో.

"స్త్రీ పురుషులలో ఒండొరులమీద ప్రేమ లేకపోతే, అట్టివారి కలయిక రుచి హీనమైనది. సమానురాగం కలవారు కలుసుకోలేక నశించిపోయినా, ఆ స్థితి చాలా ఉత్తమమైనది."

'నిలకడ లేకన్, మనుజుల
విలువెరుగక, ధనముతోడి వెలగట్టెడి, ఈ
లలనలను నమ్మి, మనమున
నిలువుట నాబోటివాళ్ల నేరమె సుమ్మా!'

అని ఇప్పుడు బాగా తెలుసుకున్నాను.

ఆ బాంధవ్యాన్ని మీముందు ప్రక్షాళనం చేసికొంటున్నాను. ఎటొచ్చీ ఆఖరిసారిగా మీకొక మాట.

'మానోహి మహతాం ధనమ్' అన్నారు విజ్ఞులు. కేవలం ఒక స్త్రీ కారణంగా పురుషభూషణాలయిన నా సౌశీల్యమూ, వ్యక్తిత్వమూ దెబ్బతినడం నేను సహించలేను. మీకు నామీద ఏర్పడ్డ దారుణమైన అభిప్రాయాల్ని మా బంధువర్గంలోకి విసిరి, మా కుటుంబప్రతిష్ఠ కలుషితంచెయ్యవద్దని అర్థిస్తున్నాను. మీకు మామీద ఎటువంటి అపోహలున్నా, దానికి మేము బాధ్యులముకాము. కాని, వాటిని అందరికి పంచి మమ్మల్ని న్యూనపరచడం వివేకవంతుల లక్షణం కాదని గ్రహించండి.

సెలవు.
మీ,
రాజగోపాల్."

శేఖర్ పూర్తిగా చదివి అన్నాడు.

"రాజా! ఇది ఆయనపై ఎలాంటి ప్రభావాన్ని తీసుకువస్తుందో ఊహించలేముగానీ, ఇందులో నీ గుండెల్లో మండే వేదనతోబాటు, నీ ఔన్నత్యం కూడా కనిపిస్తూంది. తప్పకుండా పోస్ట్‌చెయ్యి. ఏ విధంగా పరిణమిస్తుందో చూద్దాం!"

శేఖర్ ప్రోత్సాహంతో ఉత్తరాన్ని పోస్ట్‌చేశాడు రాజా.

కొన్నేళ్లుదొర్లిన తరవాత ఓనాడు శేఖర్‌కి స్టేషన్‌లో పద్మ కనిపించింది. జీవం ఇంకిపోయిన కళ్లూ, జవం ఉడిగిపోయిన శరీరమూ చీకటి ఆవరించిన ముఖమూ. శేఖర్‌కి పద్మలో చాలా మార్పు కనిపించింది. రాజు చూసి మురిసిపోయిన సౌందర్యం ఈమెలో ఇప్పుడు లవలేశమైనా లేదు.

సాదా హాండ్‌బాగ్ చేతిలో పట్టుకుని రైలు రాకకోసం ఎదురుచూస్తూంది.

శేఖర్‌కి పలకరించాలని బుద్ధిపుట్టింది.

దగ్గిరగా వెళ్లి "హలో, గుర్తున్నానండి?" అని అడిగాడు.

పద్మ క్షణంసేపు నివ్వెరపోయి తేరుకుని, "మీరా! ఎంతవరకు?" అంది.

"విశాఖపట్నం వెడుతున్నా. రాజును చూడ్డానికి." అర్థోక్తిలో అన్నాడు ఆదోలా చూస్తూ.

"ఇప్పుడేం చేస్తున్నాడతను?" మామూలుగానే అడిగింది.

"బాంక్‌లో ట్రైనీ ఆఫీసర్. ఏదో అరువందలు వస్తాయి లెండి. పూర్ ఫెలో. పాపం! పేదబ్రతుకు! ఇంతకీ మీరెక్కడుంటున్నారు? మీవారేం చేస్తున్నారు?" కుతూహలంగా అడిగాడు.

ఆమె తలవంచుకుని జవాబు చెప్పింది. "నా కింకా వివాహం కాలేదు. ప్రస్తుతం ఫ్రాన్స్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నా."

"ఆదేమిటి? ఏ డాక్టరుకో, ఇంజనీర్‌కో, కలెక్టరుకో, లాయర్‌కో, లక్షాధికారికో మీకు వివాహం అయిఉంటుందని అనుకుంటున్నాం. మీరు ఏ ఎం. బి. బి. యస్. నో, ఇంజనీరునో చేసుకుంటాననేగా రాజుతో చెప్పి దూరం చేసుకున్నారు. వాళ్లూ మీకు నచ్చలేదా?" కావాలనే శేఖర్ గుచ్చిగుచ్చి అడిగాడు, రాజుకి జరిగిన అన్యాయాన్ని గుర్తుచేసుకుంటూ!

"శేఖర్‌గారూ! గాలిమేడలూ, పేకమేడలూ ఏమవుతాయో మీకు తెలియనిదేముంది?". పేలవంగా నవ్వింది. భారంగా కదిలి వెళ్లిపోయింది అక్కణ్ణించి.

శేఖర్ నిరుత్తరుడై చూస్తూ ఉండిపోయాడు. ★